ఇంటింటా తెలుగు.. మహోజ్వల వెలుగు

- కొనియాడిన వక్తలు
- ఘనంగా తెలుగుభాషా దినోత్సవం


గిడుగు రామమూర్తి జయంత్యుత్సవంలో పాల్గొన్న కమిషనర్ దినేష్ కుమార్


జిల్లా పోలీసు కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఏఎస్పీ రాజశేఖర్

రాజమహేంద్రవరం సిటీ: ప్రతి ఇంటా తెలుగు వెలుగులు విరబూయాలని కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ అన్నారు. గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకు వచ్చిన మహనీయుడు గిడుగు వెంకట రామమూర్తి అని కొనియాడారు. సోమవారం నగరపాలక సంస్థలో గిడుగు రామమూర్తి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, డిప్యూటి డైరెక్టర్ (అమృత్) రామారావు, మేనేజరు ఎండీ అబ్దుల్ మాలిక్ అస్ఫర్ పాల్గొన్నారు. ఆర్టీసీ కార్యాలయంలో డీపీటీఓ షర్మిల అశోక ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపల్ కె.రామచంద్రరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి కవి, గజల్స్ రచయిత పూర్వ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ఎస్.వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రామచంద్రరావు మాట్లాడుతూ ఈనెల 23 నుంచి వారం రోజుల పాటు తెలుగు బాషా దినోత్సవాలు ఘనంగా నిర్వహించామన్నారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి పతకాలను ప్రదానం చేశామన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి అధ్యక్షత తెలుగుభాషా దినోత్సవం నిర్వహించారు.

- వ్యవహారిక భాషోద్యమ నాయకుడిగా గిడుగు రామమూర్తి కీర్తిని పొందారని రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఎం.తిరుమలదాస్ అన్నారు. స్థానిక మున్సిపల్ కాలనీలోని బీఈఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. హెచ్ఎం బి.శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- స్థానిక డీఎంహెచ్ స్కూల్లో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా జరిగింది. ఝాన్సీలక్ష్మీ బాయి, గిడుగు రామమూర్తి, తెలుగుతల్లి, మొల్ల, తరిగొండ వెంగమాంబ, తిక్కమాంబ, శంకరంబాడి సుందరాచారి వేషధారణలో విద్యార్థులు అలరించారు.
- జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేశారు. గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న రాజమహేంద్రి మహిళా జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ కర్రి రామారెడ్డి హాజరయ్యారు. కళాశాలల అధినేత టీకే.విశ్వేశ్వర రెడ్డి, తేతలి సత్య సౌందర్య, ఎస్ఆర్.పృథ్వీ పాల్గొన్నారు.

కడియం: మండలంలోని వేమగిరి కొండపైగల బుద్ధవిహార్‌లో గిడుగు రామ్మూర్తి జయంతి, మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఫ్యూచర్ కిడ్స్..

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక కవలగొయ్యి రోడ్డులోని ది ఫ్యూచర్ కిడ్స్ పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. వ్యవహారిక భాషోద్యమ నాయకుడు గిడుగు రామమూర్తి పంతులు జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీ. ఈ వేడుకలలో వివిధ తెలుగు కవుల వేషధారణలో విద్యార్థులు అలరించారు. వారు నిర్వహించిన అష్టావధానం ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. హైదరాబాద్ జాన్సన్స్ గ్రామర్స్ స్కూల్ టీచర్ డాక్టర్ పుచ్చా వరలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరు కాగా, సభకు పాఠశాల తెలుగుశాఖాధిపతి ప్రసన్న అధ్యక్షత వహించారు. పాఠశాలలో నిర్వహించిన తెలుగు భాషా ప్రావీణ్య పరీక్షలో గెలుపొందిన విజేతలకు బహుమతులందించారు. జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు, పతకాలు అందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రవిబాబు యేలేటి, చైర్ పర్సన్ యేలేటి విజయకుమారి, ప్రిన్సిపల్ శేషగిరిధర్, వైస్ ప్రిన్సిపల్ సైదాబాను, డీన్ హర్షిణి పాల్గొన్నారు.

ధవళేశ్వరం: తెలుగు భాషా దినోత్సవాన్ని ధవళేశ్వరం బాలికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు యు.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఎంపీపీఎస్ వాడపేట పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ఏ.వరలక్ష్మీదేవి, సీఆర్‌పీ జ్యోతి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.


వివిధ క్రీడాపోటీలలో విజేతలతో ఫ్యూచర్‌కిడ్స్ డైరెక్టర్ రవిబాబు యేలేటి


ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త మూర్తి నాయుడును సత్కరిస్తున్న సంజీవరావు తదితరులు


మాట్లాడుతున్న డాక్టర్ కర్రి రామారెడ్డి

గొప్పదనం తెలుసుకోవాలి

సీటీఆర్ఐ: ఆత్మవిశ్వాసాన్ని పెంచే అమ్మ భాషను అన్ని రంగాల్లోనూ వినియోగించడమే గిడుగు రామమూర్తికి ఇచ్చే ఘనమైన నివాళి అని ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ కేఎస్ మూర్తి నాయుడు అన్నారు. ఎస్కేవీటీ ప్రభుత్వ కళాశాల, కళాగౌతమి సారస్వత పరిషత్ సంయుక్త నిర్వహణలో తెలుగు భాషా వారోత్సవాల ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తెలుగును వాడుకభాషగా సామాన్యులకు చేరువ చేసేందుకు ఆనాడు పెద్ద పోరాటమే చేశారన్నారు. ఇప్పుడు తెలుగును కాపాడుకునేందుకు ఇంకా పెద్ద ఉద్యమం చేయాలి అని పిలుపునిచ్చారు. సభకు తెలుగుశాఖ అధిపతి డాక్టర్ పీవీబీ సంజీవరావు అధ్యక్షత వహించారు.

- తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడుకోవాలని జిల్లా అభ్యుదయ రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కర్రి రామారెడ్డి అన్నారు. ఆ సంఘం, రాజమహేంద్రి మహిళ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక రాజమహేంద్రి మహిళా డిగ్రీ కళాశాలలో గిడుగు రామమూర్తి జయంతి, తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.
- రుడా కార్యాలయంలో గిడుగు రామమూర్తి చిత్రపటానికి రుడా వైస్ చైర్మన్ బి.బాలస్వామి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రుడా సెక్రటరీ జి.శైలజవల్లి, ప్లానింగ్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.


రుడా కార్యాలయంలో...

జీవ వైవిధ్య పరిరక్షణ సమష్టి బాధ్యత


విద్యార్థులు, అధ్యాపకులతో డాక్టర్ బీఎంకే రెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: జీవావరణ వైవిధ్యం, అంతరించిపోతున్న జాతులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని రాష్ట్ర జీవవైవిధ్యం బోర్డు చైర్మన్ డాక్టర్ బీఎంకే రెడ్డి అన్నారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవంలో భాగంగా మంగళవారం రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ బయో డైవర్సిటీ చట్టం 2002 ఆవశ్యకత, అది అమలు జరుగుతున్న తీరును వివరించారు. అడవులలో ఉండే పులుల సంఖ్యను బట్టి అక్కడ పర్యావరణ సమతుల్యతను అర్థం చేసుకోవచ్చన్నారు. మన రాష్ట్రానికే ప్రత్యేకమైన ఒంగోలు జాతి పుంగనూరు ఎద్దులు, ఆవులు, అశీల కోళ్లు, పులస చేప మొదలగు వాటి విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో అసోసియేటెడ్ ఇన్‌చార్జి డాక్టర్ కె.మాధవి, ప్రొఫెసర్ అండ్ హెడ్ (అగ్రనమి) డాక్టర్ దయాకర్, ప్రొఫెసర్ అండ్ హెడ్ (ఎంటమాలజీ) డాక్టర్ ప్రవీణ, డాక్టర్ వసంత భాను, డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ జి.రమేష్ పాల్గొన్నారు.

పేదల ఇంటికే ప్రభుత్వ సేవలు

- పథకాలతో అందరికీ మేలు
- వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్


ప్రజలతో మాట్లాడుతున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదల ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు చేరుతున్నాయని వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ కోరారు. 39వ డివిజన్ లింగంపేటలో పార్టీ డివిజన్ ఇన్‌చార్జి లంకా ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పెన్షన్ కోసం ప్రజలు కాళ్లరిగేలా తిరిగేవారన్నారు. జగన్ పాలనలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని పథకాలు ఇంటి వద్దకే వలంటీర్లు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, నాయకులు గొట్టుముక్కల రాజు, కొమ్మోజు దుర్గారావు, జయశంకర్ పాల్గొన్నారు.

వైభవంగా శ్యామలాంబ జాతర


జాతరలో పాల్గొన్న ఎంపీ భరత్ రామ్, కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక నందం గనిరాజు జంక్షన్‌లో కొలువైన శ్యామలాంబదేవి జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీ మార్గాని భరత్ రామ్ ముఖ్య అతిథిగా హాజరై, ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండపంలో ప్రతిష్ఠించిన శ్యామలాంబ ఉత్సవ విగ్రహాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దంపతుల పేరిట విశేష పూజలు చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు లేని గ్రామాలను తీర్చిదిద్దాలి

కంబాలచెరువు: ప్రతి జిల్లాలోనూ కనీసం ఒక గ్రామాన్ని గుర్తించి, ఆ గ్రామంలో సంబంధిత అధికారుల సహకారంతో వివిధ వర్గాల ప్రజల సమస్యలను పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత సూచించారు. ఆ గ్రామాన్ని పూర్తిగా ఫిర్యాదు రహిత, వ్యాజ్య రహితమైన ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం ఆదేశానుసారం మంగళవారం జిల్లా న్యాయస్థానం ఆవరణలో రెవెన్యూ, పోలీసు అధికారులు, న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేసే దిశగా రెవెన్యూ, పోలీసు, కార్మిక, తదితర శాఖలు సమన్వయంగా కృషి చేయాలన్నారు. దీనికి చేపట్టిన కార్యాచరణల నివేదికను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు సమర్పించాలని ఆదేశించారు. ఈ క్రమంలో వారికి సహకరించేందుకు న్యాయవాదులను, పారా లీగల్ వలంటీర్లను నియమించామన్నారు.

కడుపుబ్బా నవ్వించే మిస్టర్ పొలిశెట్టి


విలేకరుల సమావేశంలో హీరో నవీన్ పోలిశెట్టి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమాలోని హాస్య సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయని ఆ సినిమా హీరో నవీన్ పోలిశెట్టి అన్నారు. ఆ సినిమా సెప్టెంబర్ 7వ తేదీన విడుదల కానున్న విషయం తెలిసిందే. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరంలోని షెల్టాన్ హోటల్‌లో హీరో నవీన్ విలేకరులతో మాట్లాడారు. గోదావరి వాసుల ఆప్యాయత తనకెంతో ఇష్టమన్నారు. తన సినిమా ప్రమోషన్‌లో భాగంగా నగరానికి వచ్చామన్నారు. చిత్ర టీజర్, ట్రైలర్‌కు ఇప్పటికే ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోందని, దర్శకుడు మహేష్‌బాబు తీసిన సన్నివేశాలు ప్రేక్షకులను కచ్చితంగా ఆకట్టుకుంటాయన్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా అభిమానులు ఆయనతో సెల్ఫీలు తీసుకునేందుకు పోటీపడ్డారు. సమావేశంలో శ్రీమణికంఠ ఫిలిమ్స్ మేనేజర్ సుబ్బరాజు, కరెన్సీ ఫిలిమ్స్ రాజు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు


అవార్డులతో సత్కరిస్తున్న దృశ్యం

ప్రకాశం నగర్: క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) ఎస్.అబ్రహం అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మంగళవారం సాయంత్రం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎస్‌కెవీటీ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డీఈవో ఎస్.అబ్రహం, డీవైఈవో తిరుమలదాస్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. గతేడాది జిల్లాలో క్రీడల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన ఐదు పాఠశాలలను ఎక్స్‌లెన్స్ అవార్డులతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ దిలీప్ కుమార్, ఎస్‌కేవీటీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రమణ మూర్తి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు ఏవీడీ ప్రసాద్ , కార్యదర్శి నాగరాజు, కోశాధికారి ఎస్.వీరబాబు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

కంబాలచెరువు: విద్యా చట్టాలు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్, పర్మనెంట్ లోక్ అదాలత్, ప్రోబోనో న్యాయసేవలపై మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ విద్యాభ్యాసానికి దూరంగా ఉంటున్న, విద్యాభ్యాసాన్ని మధ్యలోనే విడిచిపెడుతున్న బాలబాలికలను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం ప్రకారం ఆరు నుంచి 14 ఏళ్ల వయస్సు గల పిల్లలందరూ అర్హులన్నారు. పర్మనెంట్ లోక్ అదాలత్ చైర్మన్ ఏ.గాయత్రీదేవి మాట్లాడుతూ పర్మనెంట్ లోక్ అదాలత్ విధులు, వాటి ద్వారా పరిష్కారమయ్యే అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ దిలీప్ కుమార్, సీడీపీవో సీహెచ్‌వీ నరసమ్మ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎం.లలిత కుమారి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జె.మహేష్, ప్యానల్ అడ్వకేట్ డి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆంధ్రా పేపర్ మిల్లులో ఎన్నికలు నిర్వహించాలి

కాకినాడ సిటీ: తూర్పుగోదావరి జిల్లా ఆంధ్రా పేపర్ మిల్లు లిమిటెడ్ రాజమహేంద్రవరం యూనిట్‌లో ఎన్నికలు నిర్వహించాలని, యాజమాన్య అనుకూల వైఖరి అవలంబిస్తున్న డీసీఎల్‌ను సస్పెండ్ చేయాలని పేపర్‌మిల్ 8 కార్మిక సంఘాల నాయకులు, కేంద్ర కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కాకినాడ డీసీఎల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆంధ్రా పేపర్ మిల్లు లిమిటెడ్ యూనిట్లో గుర్తింపు సంఘం ఎన్నికలు దాదాపు నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇటీవల 2023 మార్చి నుంచి తిరిగి ఎన్నికల ప్రక్రియను ప్రారంభించారన్నారు. కానీ యాజమాన్యం హైకోర్టుకు వెళ్లిందనే సాకు చెప్పి నిలిపివేశారన్నారు. దీంతో వేతన ఒప్పందం ఆలస్యం అవుతొందన్నారు. తక్షణమే డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ లక్ష్మీనరసయ్యను సస్పెండ్ చేసి మరో అధికారికి ఆ బాధ్యతలు అప్పగించలని డిమాండ్ చేసింది.

సెంట్రల్ జైల్ రిమాండ్ ఖైదీ మృతి

కంబాలచెరువు: మావోయిస్టు ఆరోపణ కేసులో అరెస్టు అయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు శిక్ష అనుభవిస్తున్న మండక్కం గంగయ్య (26) మృతి చెందిన సంఘటనపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. వివరాల్లోకెళితే... ఏఎస్ఆర్ జిల్లా కూనవరం మండలం రామచంద్రపురానికి చెందిన గంగయ్య గత ఏడాది డిసెంబర్ 26న అనుమానిత మావోయిస్టుగా పోలీసులు అరెస్టు చేయడంతో, కోర్టు అతడికి రిమాండ్ విధించింది. ఇదిలావుండగా ఈనెల 27 మధ్యాహ్నం గంగయ్యకు కడుపులో నొప్పి, జ్వరం, వాంతులు రావడంతో జైలులోని ఆసుపత్రిలో చికిత్స అందించారు. ఆరోగ్యం క్షీణించడంతో వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో పాటు కిడ్నీ కూడా పాడవడంతో ఐసీయూలో ఉంచి మెరుగైన చికిత్స అందించారు. అయితే గంగయ్యకు గుండె పోటు రావడంతో వైద్యులు సీపీఆర్ నిర్వహించారు. అయినా ఫలితం దక్కలేదు. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఆన్‌లైన్ మోసంపై ఫిర్యాదు

ధవళేశ్వరం: తన క్రెడిట్ కార్డును ఉపయోగించి ఆన్‌లైన్‌లో రూ.80,791 మోసం చేశారని ధవళేశ్వరం సంజయ్‌నగర్ కాలనీకి చెందిన అక్కాబత్తుల హరి సింహాద్రిబాబు ధవళేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక ప్రైవేట్ బ్యాంకుకు సంబంధించి తన క్రెడిట్ కార్డు నుంచి మూడు దఫాలుగా సొమ్మును వినియోగించినట్లు తనకు మెసేజీలు వచ్చాయన్నాడు. తాను ఎటువంటి లావాదేవీలు జరపలేదని పేర్కొన్నారు. ఈ మేరకు ధవళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ భూములకు సరిహద్దులు నిర్ణయించాలి

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ప్రభుత్వ సంస్థల భూములకు సరిహద్దులు నిర్ణయించాలని కమిషనర్ కె.దినేష్ కుమార్ ఆదేశించారు. ఆయన మంగళవారం టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్షించారు. నగరంలో ఎనిమిది టౌన్ ప్లానింగ్ సర్కిళ్లకు 8 బృందాలను నియమించి ఈ కార్యక్రమం నిర్వహించాలన్నారు. నగర సర్వే రికార్డు మొత్తం నవీకరణ చేయాలన్నారు. మోరంపూడి రోడ్డు, తూర్పు రైల్వే స్టేషన్ రోడ్డు విస్తరణ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. నగరంలో అన్ని కట్టడాలను పరిశీలించి, అక్రమ కట్టడాలుంటే చట్ట ప్రకారం చర్య తీసుకోవాలని ఆదేశించారు. కన్‌స్ట్రక్షన్లు, డిమోలిషన్ వ్యర్థాలను తొలగించడంలో కఠినంగా వ్యవహరించాలని, నియమాలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించాలని ఆదేశించారు. సమీక్షలో సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, డిప్యూటీ సిటీ ప్లానర్ వైవీబీ చంద్రబోస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు వరహాల బాబు, అనితా జోలి పాల్గొన్నారు.

భవానీ శంకర్ మృతి తీరని లోటు


అన్నదానం చేస్తున్న బూరాడ కృష్ణమాధురి

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ నాయకుడు బూరాడ భవానీ శంకర్ మృతి తీరనిలోటు అని ఆయన మిత్ర బృందం ఆవేదన వ్యక్తం చేసింది. భవానీ శంకర్ జయంతి సందర్భంగా మంగళవారం సంజీవయ్య నగర్ పనస చెట్టు సమీపంలోని భవానీ శంకర్ నివాసం వద్ద ఆయన మిత్రులు ముత్యాల పెదబాబు, మాజీ కార్పొరేటర్ మానే దొరబాబు, సూర్యారావు, చల్లారావు, దుద్దుపూడి శ్రీను తదితరులు భవానీ శంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, స్వీట్లు, చాక్లెట్లు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో భవానీ శంకర్ సతీమణి, మాజీ కార్పొరేటర్ బూరాడ కృష్ణమాధురి, కుమారుడు బూరాడ స్వామి అర్చన్, కుమార్తె సత్యసాయి కిరణ్మయి పాల్గొన్నారు. అనవతరం పుష్కర ఘాట్ వద్ద పేదలకు అన్నదానం చేశారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): శిక్షణ కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శులు సద్వినియోగం చేసుకోవాలని సామర్లకోట జిల్లా శిక్షణా కేంద్రం ప్రిన్సిపల్ వేణుగోపాల్ పిలుపునిచ్చారు. కలెక్టర్ సూచనలతో, పంచాయతీరాజ్ స్పెషల్ చీఫ్‌సెక్రటరీ ఆదేశాల మేరకు ఆరు రోజులు పాటు నిర్వహిస్తున్న శిక్షణ మంగళవారం స్థానిక రివర్‌బే హోటల్లో ప్రారంభమైంది. వేణుగోపాల్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పాలన, గ్రామసభలు తదితర అంశాలపై పలు సూచనలు ఇచ్చారు. జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం కో ఆర్డినేటర్ ఆర్మ్‌స్టాంగ్, రిసోర్స్‌పర్సన్లు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రేడ్–1 నుంచి గ్రేడ్–5 వరకు వందమంది పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

31న సత్యనారాయణ స్వామి వ్రతాలు

సీటీఆర్ఐ: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గురువారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తామని టీటీడీ జిల్లా ధార్మిక కమిటీ సభ్యుడు కాలెపు సతీష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. శ్రావణ పౌర్ణమి రోజున గురువారం ఉదయం 8 గంటల నుంచి జ్ఞాన సరస్వతీ పీఠం, సరస్వతీ ఘాట్‌లో టీటీడీ ధార్మిక కమిటీ సభ్యుడు తోట సుబ్బారావు నిర్వహణలో జరుగుతాయన్నారు. వ్రతాల్లో పాల్గొనే భక్తులకు సత్యనారాయణ స్వామి డాలర్, నవగ్రహ మండపం, అన్నవరం సత్యనారాయణ స్వామి ప్రసాదం పంపిణీ చేస్తామన్నారు.

రాజాయోనాకు పురస్కారం

రాజమహేంద్రవరం రూరల్: మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మీడియా అకాడమీ ఆధ్వర్యంలో విజయవాడలో చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు సారథ్యంలో తెలుగు భాష, సాహిత్యరంగంలో విశిష్ట సేవలు చేసిన వ్యక్తులకు పురస్కారాలను అందించారు. ఈ మేరకు ఫిలాంత్రోఫిక్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి రాజా యోనా పురస్కారం అందుకున్నారు. ఫిలాంత్రోఫిక్ సొసైటీ ద్వారా తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాల కోసం చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ గౌరవం లభించింది.

సినీ హీరో నాగార్జున జన్మదిన వేడుకలు


వృద్ధుడికి కేక్ తినిపిస్తున్న కాటం రజనీకాంత్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక సూర్యప్యాలెస్ థియేటర్ ఆవరణలో సిటీ వైడ్ అక్కినేని నాగార్జున, నాగచైతన్య, అఖిల్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు కాటం రజనీకాంత్ ఆధ్వర్యంలో మంగళవారం నటసామ్రాట్ అక్కినేని నాగార్జున జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అభిమానులకు తినిపించారు. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటర్ చిన్ని, కె.భాను, ఏ.రాజేష్, ఆర్.మురళి, సూరి, ఏ.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సీనియర్ క్రీడాకారుడికి సత్కారం

ప్రకాశం నగర్: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మంగళవారం గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీలో సీనియర్ క్రీడాకారుడు పీవీవీ సత్యనారాయణరావును ఘనంగా సత్కరించారు. టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు జేవీవీ అప్పారెడ్డి, కార్యదర్శి వీటీవీ సుబ్బారావు మాట్లాడుతూ అంతర్జాతీయ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకొంటున్నామన్నారు.

తోరాటికి సతీ వియోగం


విజయలక్ష్మి (ఫైల్)

ధవళేశ్వరం: పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు డాక్టర్ తోరాటి ప్రభాకరరావుకు సతీ వియోగం కలిగింది. ఆయన భార్య విజయలక్ష్మి (55) మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ వీధిలోని తోరాటి ప్రభాకరరావు స్వగృహం వద్ద విజయలక్ష్మి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. తోరాటి ప్రభాకరరావును పరామర్శించి ఓదార్చారు. పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బీవీటీ రాజు, మాజీ అధ్యక్షుడు జయసూర్య, రాజమహేంద్రవరం డివిజన్ రెహ్మాన్ ఖాన్, జిల్లా కార్యదర్శి బల్లా శ్రీనివాసరావు, డివిజన్ కార్యదర్శి మట్టా రమేష్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం

రాజమహేంద్రవరం రూరల్: ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి రోజూ వ్యాయామం తప్పనిసరిగా చేయాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చవాన్ శ్యామ్ రాజు నాయక్ అన్నారు. కాతేరులోని వ్యవసాయ కళాశాలలో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకొన్నారు. పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

టీడీపీ నాయకుల నిరసన

రాజమహేంద్రవరం రూరల్: ఇసుక అక్రమాలపై విచారణ చేపట్టాలని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి డిమాండ్ చేశారు. మంగళవారం రూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. తహసీల్దార్ పైడి చిన్నారావుకు వినతిపత్రం అందజేశారు.

బంగారు ఆభరణాల చోరీ

ధవళేశ్వరం: ఎర్రకొండ ప్రాంతానికి చెందిన ములంపాక రాములు ఇంట్లో దొంగలు చొరబడి ఐదు కాసుల బంగారు అభరణాలను చోరీ చేశారు. రాములు సోమవారం రాత్రి ఇంటి ప్రధాన ద్వారం మూసివేసి లోపల తాళం వేశాడు. అయితే చెవిని తాళానికే ఉంచేశారు. అనంతరం పడుకొని ఉదయం లేచి చూసేసరికి బీరువా తెరిచి ఉంది. పరిశీలించిగా అందులోని ఐదు కాసుల బంగారు గొలుసు, ఉంగరాలు, శతమానాలు చోరీకి గురి అయినట్లు గుర్తించారు. రాములు ఫిర్యాదు మేరకు ధవళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేశారు.